


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 2-4-2025
సంపుటి: 21 సంచిక: 7
పేజీలు: 8 వెల: రూ.1

## గల్లంతైన మత్స్యకారుల మృతదేహాలు లభ్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో మంగళవారం ఉదయం వేటకు వెళ్లి ఇద్దరు మత్స్యకారులు గల్లంతయిన విషయం తెలిసిందే. గల్లంతైన వంక కృష్ణ, బుంగ ధనరాజు మృతదేహాలు బుధవారం ఉదయం అక్కుపల్లి, దోకులపాడు తీర ప్రాంతాలకు చేరాయి. ఈ మేరకు వారి మృతదేహాలను బోటులో మంచినీళ్లపేట తరలించారు. మంగళవారం ఉదయం సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు గల్లంతు కాగా, మరో ఇరువురు క్షేమంగా బయటపడ్డారు.

### మృతుల కుటుంబాలకు పరిహారం



మంచినీళ్లపేటకు చెందిన ఇద్దరు మత్స్యకారులు సముద్రం వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందిన ధనరాజు, కృష్ణ కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు, మత్స్యశాఖ నుంచి రూ.5 లక్షలు పరిహారాన్ని ప్రకటించింది. మొత్తంగా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని, మత్స్యకారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి ప్రమాదాలు జరగకుండా తీసుకువాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు



| | | | | |
|---|---|---|---|---|
| VILL/COL: PALASA/K T ROA D-12#1 to 4 W-B: 12-12 SURVE Y: 219/3 HOUSE: 12-12-2 EXTE NT: 62.83SQ.Yds BUILT: 566S Q. FT HOUSE Boundires: [N]: HOUSE OF POTULA DEVAPR ASADH [S] HOUSE OF MALL A VENKATA RAO [E]: K T RO | (R) 16-09-2023 (E) 16-09-2023 (P) 16-09-2023 | 0302 Gift Settlement in f/o family Mkt.Value:Rs. 1881775 Cons.Valu | 1.(DR)NEYYALA RAMA RAO 2.(DE)NEYYILA RAJU | 0/0 5275/2023 [1] of SRO KASIBUGGA(104) |

- ★ పలాస పట్టణంలో హాట్ టాపిక్‌గా మారిన వివాదం
- ★ కొన్నామంటున్న ఇద్దరు, అగ్రిమెంటు పొందామని మరో ఇద్దరు
- ★ అసలు వారసులను కాదని ఎవరెవరో తెరపైకి
- ★ మళ్లీ విక్రయానికి, పొజీషన్‌కు, నిర్మాణానికి ఎవరి స్థాయిలో వారి యత్నాలు
- ★ ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్న ఆయా శాఖల అధికారులు

## ఆ స్థలం వారిదేనట!?
# దాని చుట్టూ నాలుగు స్తంభాలాట

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కాస్త విలువైన స్థలం కనిపిస్తే చాలు.. దాని చుట్టూ కాకుల్లా వాలిపోతారు అక్రమార్కులు. పలాస-కాశీబుగ్గ పట్టణంలోని జీటీ రోడ్డులో ఒక ఖరీదైన స్థలం చుట్టూ ఇదే దందా జరుగుతోంది. ఆ రోడ్డులో ఒక రేకుల షెడ్డులో బట్టలు దుకాణం నడుస్తున్న స్థలం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కోట్లు విలువ చేసి సర్వే నెం. 219/3లోని 565.5 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఆ స్థలంపై తనకు అగ్రిమెంట్ ఉందంటూ నాలుగో కృష్ణుడు రంగప్రవేశం చేయడం కలకలం రేపుతోంది. తమది కాని ఆ స్థలాన్ని సొంతం చేసుకోవడానికి కొందరు వ్యక్తులు చేస్తున్న ప్రయత్నాలను 'సత్యం' ఇంతకుముందే వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. మొదట స్థలాన్ని అద్దెకు తీసుకున్న నెయ్యల రామారావు అది తనకు పిత్రార్జితంగా సంక్రమించినట్టు చూపించి తన కుమారుడు నెయ్యల రాజు పేరుతో గిఫ్ట్ సెటిల్మెంట్ రిజిస్ట్రేషన్ చేశాడు. నెయ్యల రాజు దాన్ని రొక్కం సాయి అనే వ్యక్తికి విక్రయించాడు. కాగా ఆ స్థలం తమదేనంటూ వరదరాజపురానికి చెందిన యు.మన్మధరావు కౌన్సిలర్ బోర బుజ్జికి విక్రయించాడు. 'సత్యం'లో దీన్ని వెలుగులోకి తెచ్చిన తర్వాత పట్టణానికి చెందిన నారాయణరెడ్డికి కూడా నెయ్యల రాజు అగ్రిమెంట్ రాసిన విషయం బయటపడింది. తనకు అగ్రిమెంట్ ఇచ్చిన తర్వాతే రొక్కం సాయికి నెయ్యల రాజు విక్రయించినట్టు నారాయణరెడ్డి చెబుతున్నాడు. ఆ విధంగా ఒకే స్థలం కోసం వేర్వేరు వ్యక్తులు తమదంటే తమదేనని కుస్తీలు పడుతున్నారు. దీంతో ఈ వ్యవహారంలో పలాస పోలీసు అధికారి జోక్యం చేసుకున్నట్టు తెలిసింది.

### ఫలించని రాజీ యత్నాలు

నారాయణరెడ్డికి ఇచ్చిన అగ్రిమెంట్ చెల్లదని బుకాయించడానికి యత్నించిన నెయ్యల రాజు పోలీసుల జోక్యంతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది. ఈ వివాదంలో టీడీపీ నాయకుల జోక్యంతో పలాస పోలీసు అధికారి వద్దకు పంచాయితీ చేరింది. సదరు అధికారి నెయ్యల రాజును పిలిపించగా న్యాయవాదితో కలిసి వెళ్లి సివిల్ మేటర్ కనుక కోర్టులో తేల్చుకుంటామని చెప్పారట. దాంతో ఆయన అగ్రిమెంట్ కాపీ చూపించి దీని సంగతేంటని ప్రశ్నించడంతో నెయ్యల రాజు దారికి వచ్చినట్టు తెలిసింది. సదరు అధికారి సమక్షంలోనే ఒక కాగితం రాయించి రాజీ ఒప్పందం చేయించి అగ్రిమెంట్‌గా ఇచ్చిన

- మిగతా చివరి పేజీలో









• ఎడిటోరియల్

# వ్యవ'సాయం' తీరు మారాల్సిందే!

రసాయనిక ఎరువుల వాడకం రైతుల ఆర్థిక స్థితిని, పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. రాష్ట్రంలో ప్రధాన పంటలైన వరి, పత్తి, చెరకు, ఇతర వాణిజ్య పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం అనివార్యంగా మారిందని రైతులు అంటున్నారు. కానీ దీనివల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. పెట్టుబడులు పెరిగి అప్పుల్లో కూరుకుపోవడం, అనారోగ్యాలకు గురికావడం, భూసారం క్షీణించడం వంటి అనర్థాలు జరుగుతున్నాయి. ఈ ఒత్తిళ్లను తట్టుకోలేక చాలామంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రసాయనిక ఎరువులను అధికంగా వాడటం వల్ల భూమిలో సూక్ష్మజీవులు నశించి దీర్ఘకాలంలో దిగుబడులు తగ్గిపోతాయి. పైగా ఈ ఎరువుల ధరలు ఎక్కువ కావడంతో అప్పులుచేయాల్సి వస్తోంది. వాటిని తీర్చలేని స్థితిలో ఒత్తిడి పెరిగి పలువురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2022 జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం రాష్ట్రంలో 917 మంది రైతులు అప్పుల భారంతోనే ఆత్మహత్యలు చేసుకున్నారు. కొన్ని హెచ్చుతగ్గులు ఉన్నా ఇప్పటికీ ఆ పరిస్థితి ఉంది. కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, చిత్తూరు, విశాఖపట్నం వంటి ఏడు జిల్లాల్లో రసాయనిక ఎరువుల వాడకం జాతీయ సగటు (90 కిలోలు/హెక్టారు) కంటే ఎక్కువగా (138 కిలోలు/హెక్టారు) ఉంది. ఈ జిల్లాల్లో వరి, చెరకు, పత్తి వంటి అధిక దిగుబడి పంటలు ఎక్కువగా పండిస్తున్నారు. ఈ పంటలకు ఎక్కువ పోషకాలు అవసరం కావడంతో రసాయనిక ఎరువులపై ఆధారపడతున్నారు. గోదావరి, కృష్ణా నదీతీర ప్రాంతాల్లో నీటి పారుదల సౌకర్యం ఉండటంతో ఏటా మూడు పంటలు పండిస్తారు. ఆ మేరకు ఎరువులు, పురుగు మందుల వినియోగమూ ఎక్కువవుతుంది. సమతుల్య ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన లేకపోవడం దీనికి ఒక కారణంగా చెప్పొచ్చు. రాష్ట్రంలో 2024-25లో ఎరువుల వినియోగం 2023-24 ఏడాదిలోని దేశ సగటు కంటే 82 శాతం అధికంగా నమోదైంది. దేశంలో ఎకరాకు సగటున 56 కిలోల రసాయన ఎరువులు వాడుతుంటే ఏపీలో మాత్రం 102 కిలోలు వాడుతున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నప్పటికీ రైతులు ఆసక్తి చూపడం లేదు. ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు సరైన సమాచారం అందకపోవడమే దీనికి కారణం. అలాగూ రసాయనిక ఎరువులతో తక్షణ దిగుబడి లభిస్తుంటే ప్రకృతి వ్యవసాయంలో ఫలితాలు కనిపించడానికి సమయం పడుతుంది. సేంద్రియ ఉత్పత్తులకు సరైన మార్కెట్, ధరలు లేకపోవడం కూడా కారణంగా చెప్పొచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా నమోదు కావడం రసాయనిక వ్యవసాయ విధానాల వైఫల్యాన్ని సూచిస్తోంది. రసాయన ఎరువుల వల్ల నీటి, వాయు కాలుష్యం పెరిగి రైతు కుటుంబాలు అనారోగ్యం పాలవుతున్నాయి. పండించిన పంటను నిల్వ చేసుకునే అవకాశాలు అందుబాటులో లేవు. మార్కెటింగ్ సౌకర్యం కూడా అంతంత మాత్రమే. పంటకు తెగుళ్ల సోకడాన్ని కూడా ప్రకృతి విపత్తుగా ప్రభుత్వం గుర్తించి పరిహారం ఇవ్వాల్సి ఉంది. ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన పంటకు పూర్తిగా పరిహారం అందించాలి. రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలు రైతులు ఉన్నా వారికి ప్రభుత్వ గుర్తింపు కార్డులు లేవు. పెట్టబడి సాయం కూడా అందడం లేదు. కౌలు దారుల్లో ఎక్కువ మంది సామాజికంగా వెనుకబడిన వారే. అప్పుల కారణంగా కుటుంబాల్లోనూ గొడవలు రేగి ఆత్మహత్యలకు కారణం అవుతున్నాయి. గతంలో పశువుల మేత కోసం గడ్డిని పశువుల యజమానులు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం మిషన్ ద్వారా వరి కోత కోయించడంతో గడ్డి పనికి రాకుండా పోతోంది. ఏపీలో రైతు సంఘాల లెక్కల ప్రకారం 1.20 కోట్ల మంది రైతులు ఉన్నారు. కేవలం దేవాలయ భూములు కౌలుకు చేసే రైతులే 16.50 లక్షల మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు, విద్యుత్‌పై సబ్సిడీలు ఇస్తోంది. అయితే ఎరువుల సబ్సిడీలు కంపెనీలకే ప్రయోజనకరంగా ఉంటున్నాయి. రైతులకు స్థిరమైన ఆదాయం, మద్దతు ధరల హామీ అవసరం. సేంద్రియ వ్యవసాయంపై ప్రభుత్వం మరింత శిక్షణ, ఆర్థిక సహాయం ఇవ్వాల్సిన అవసరం ఉంది. రైతుల అప్పుల బాధలు తీరాలంటే పశుపోషణ, హార్టీకల్చర్ వంటి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను ప్రోత్సహించాలి. అధిక వడ్డీరేట్లతో కూడిన అనధికారిక రుణదాతలపై నియంత్రణ కఠినతరం చేసి, బ్యాంకుల ద్వారా సులభ రుణాలు అందుబాటులోకి తేవాల్సి ఉంటుది. పంట భీమా పథకాలు సక్రమంగా అమలు చేయాల్సి ఉంది.

## రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోంది

(సత్యంన్యూస్, పాతపట్నం)



టీడీపీ ఇస్తామన్న పథకాలన్నీ మోసాలుగా మిగిలిపోయాయని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో హామీలు ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పేరిట జనాన్ని మోసం చేశారు. ముందు అతనిపై నమ్మకద్రోహం కేసులు పెట్టాలి. అరెస్టు చేయాలి.. ప్రశ్నిస్తున్న వాళ్లను బెదిరిస్తే ఎలా... ప్రశ్నించే వాళ్ళు లేకుండా చేసి.. అన్ని వర్గాలను మోసం చేస్తూ ఈ ఐదేళ్లు గ్రాఫిక్స్‌తో బతికేద్దామని చంద్రబాబు ఫిక్స్ అయ్యారని విమర్శించారు. అందుకే సోషల్ మీడియా వాళ్లను అరెస్టులు చేస్తున్నారన్నారు. అంత చేతగానప్పుడు పెద్దపెద్ద హామీలు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. మహిళా సంక్షేమం ద్వారానే సామాజిక స్వాతంత్ర్యం సాధ్యమని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నమ్మారన్నారు.

## ప్రజా సమస్యలపై తక్షణమే పరిష్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తేవాలని సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం, గార శ్రీకాకుళ పట్టణంలోని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వములో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చన్నారు. తక్షణమే చర్యలకు ఆదేశాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ ప్రజా దర్బార్‌కు అధిక సంఖ్యలో ప్రజల వచ్చి సమస్యలపై వినతులు అందజేశారు.





అమెరికా పర్యటనలో భాగంగా సెయింట్ లూయిస్‌లో తెలుగుదేశం పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం నాయకులు ఏర్పాటు చేసిన తెదేపా ఆవిర్భావ దినోత్సవానికి ఏపీ పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 43 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ సాధిస్తున్న విజయాలని ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతున్న పథకాలను వివరించారు. యువ పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా రవికుమార్ కోరారు. **- సత్యంన్యూస్, ఆమదాలవలస**

## రాసిన వ్యక్తులను తెలిపితే రూ.25వేల బహుకరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జలుమూరు మండలంలో గతనెల 29న రాత్రి వివిధ ఆలయాల గోడలపై రాసిన రాతలకు సంబంధించిన వ్యక్తులు వివరాలు తెలియజేసిన వారికి రూ.25 వేలు నగదు పురస్కారాన్ని అందించనున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయాల గోడలపై రాసిన రాతలుకు సంబంధించిన వ్యక్తులు వివరాలు తెలియజేసి ప్రజలు పోలీసు వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎవరికైనా తెలిసినట్లయితే జిల్లా ఎస్పీ:6309990800, అదనపు ఎస్పీ క్రైమ్స్: 6309990803, శ్రీకాకుళం టౌన్ డిఎస్పీ: 6309990804, నరసన్నపేట సీఐ: 6309990815, జలుమూరు ఎస్సై: 6309990848, స్పెషల్‌బ్రాంచ్ సీఐ: 6309990886 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# ఘనంగా మత్స్య నారాయణ జయంతి



(సత్యంన్యూస్, గార)

మండలంలోని కె.మత్స్యలేశం (పోర్ట్ కళింగపట్నం) సముద్ర తీరాన శ్రీదేవి-భూదేవి సమేత శ్రీ మత్స్య నారాయణ స్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం 5గంటలకు నగర సంకీర్తనతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో మత్స్య నారాయణ మాల దీక్ష స్వాములు, భజన బృందం కలిసి 6గంటల నుండి స్వామివార్లకు పంచామృత అభిషేకములు, పుష్పాలంకరణ సేవ నిర్వహించారు. అనంతరం దర్శనాలు కల్పించారు. ఉదయం 9 గంటలకు శ్రీకూర్మం దేవస్థానం స్థానాచార్యులు పద్మనాభ చార్యులు ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సుమారు వెయ్యిమందికి అన్న ప్రసాద వితరణ చేశారు. 2.30గంటల నుండి కె.మత్స్యలేశం భజన బృందంతో భజన, అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు సముద్రహారతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి మహేష్, పరిమళ్ల వాసు, గుంటు సత్తియ్య, మాగుపల్లి పొట్టివాడు, కనుగుల సత్యం మాస్టర్, కనుగుల అరుణ, ఎం.ఎర్రన్న, గంగాడ రామారావు, వాసుపల్లి కృష్ణమూర్తి, చోడిపిల్లి శ్రీరాములు, జలుమూరు సత్యం, అలిగి ధూళికేశ్వరరావు మాస్టర్, బత్తుల గోవిందరావు మాస్టర్, సింహాచలం చంటి, బొందు రాము, దుమ్ము లక్ష్మయ్య, జి.చిరంజీవులు, ఎం.నరసింహులు, పి.లక్ష్మణరావు, ఆనందరావు, పుణ్యేశ్వరరావు, సీహెచ్ శంకర్, జి.గురుమూర్తి, ఎ.వరదరాజులు, ఎం.పెంటయ్య, ఎం.అప్పన్న, బొంత లక్ష్మణరావు, బుడ్డా ఎర్రన్న, పడ్డా సూర్యనారాయణ, పెంట అప్పారావు, పుక్కళ్ళ ఉమాపతి, పుక్కళ్ళ రాజా, దాసరి ఎర్రన్న, ఎం.నందారావు తదితరులు పాల్గొన్నారు.

# విజయశాంతి రేంజ్ తగ్గలేదు!

లేడీ అమితాబ్, లేడీ సూపర్‌స్టార్ అని పిలుచుకొనేంత ఇమేజ్ సంపాదించుకొన్న నటి.. విజయశాంతి. రాజకీయాల్లోకి వెళ్లాక సినిమాలపై ఫోకస్ తగ్గించారు. చాలా కాలం తరవాత 'సరిలేరు నీకెవ్వరు' సినిమాలో తన ఇమేజ్‌కి తగ్గ పాత్ర పోషించారు. ఆ సినిమాలో విజయశాంతి అందుకొన్న పారితోషికం గురించి అప్పట్లో ఆసక్తికరమైన చర్చ నడిచింది. ఇప్పుడు 'అర్జున్ సన్నాఫ్ వైజయంతీ' సినిమాలో కీలక పాత్ర పోషించారు. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించిన సినిమా ఇది. ఈ సినిమా కోసం కూడా విజయశాంతి భారీ మొత్తంలో పారితోషికం అందుకొన్నారని ఇన్ సైడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ లేడీ సూపర్ స్టార్‌కు రూ.3 కోట్లు ముట్టజెప్పారన్నది ఓ టాక్. రూ.3 కోట్లంటే తక్కువ మొత్తం కాదు. ఓ స్టార్ హీరోయిన్‌కు ఇస్తున్న రెమ్యునరేషన్ ఇది. విజయశాంతి రేంజ్ ఏమాత్రం తగ్గలేదని చెప్పడానికి ఇదో నిదర్శనం. తల్లీ కొడుకుల కథ ఇది. విజయశాంతి పాత్రని చాలా పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్దారు. 'కర్తవ్యం సినిమాలోని వైజయంతీకి ఓ కొడుకు ఉంటే ఎలా ఉంటుంది అనే ఆలోచన నుంచి ఈ కథ పుట్టింది. దాన్ని బట్టి విజయశాంతి పాత్రకు ఉన్న ప్రాధాన్యత ఏమిటో అర్థం చేసుకోవొచ్చు. ఇటీవలే టీజర్ విడుదలైంది. మంచి స్పందన వచ్చింది. ట్రైలర్ కూడా సిద్ధమైంది. ట్రైలర్ కట్ చూసిన వాళ్లు 'కల్యాణ్ కెరీర్‌లో మరో హిట్టు గ్యారెంటీ' అని జోస్యం చెబుతున్నారు. అంత బాగా వచ్చిందట. సాధారణంగా సినిమా విడుదలకు వారం, పది రోజుల ముందు ట్రైలర్ విడుదల చేస్తారు. కానీ మూడు వారాల ముందే ట్రైలర్ ని వదిలేయాలని భావిస్తు న్నార్ట. ఈమధ్య ఓ మాస్ పాట విడుదలైంది. దానికీ మంచి స్పందనే వస్తోంది. కాస్త ప్రచారం గట్టిగా చేసుకొం టే మంచి ఓపెనింగ్స్ రాబట్టే అవకాశం వుంది.

**- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..**



# విక్రమ్ కష్టం వృధా పోతుందా?



క్యారెక్టర్ కోసం ఇమేజ్ లెక్కలు వేయకుండా వొళ్ళు హూనం చేసుకునే నటుడు విక్రమ్. ఆయన సినిమా ఫెయిల్ అవుతుందేమో కానీ నటుడికి ఆయన ప్రయత్నానికి ఎప్పుడూ మంచి మార్కులే పడతాయి. లేటెస్ట్‌గా 'వీరధీరశూర' సినిమాతో వచ్చాడు విక్రమ్. ఈ సినిమాకి మంచి టాక్ వచ్చింది. దర్శకుడు అరుణ్‌కుమార్ చాలా కొత్త ఎప్రోచ్‌తో సినిమా తీశాడు. టేకింగ్‌లో ఓ కొత్తదారిని చూపించిన సినిమా ఇది. క్యారెక్టర్ పరంగా కూడా విక్రమ్ కష్టాన్ని మెచ్చుకోవాలి. ఎక్కడా ఎలివేషన్ లేకుండా కాళి పాత్రలోనే కనిపించాడు. చాలా సహజంగా ఫైట్లు చేశాడు. లెన్తీ సింగిల్ షాట్స్‌లో తను కనిపించిన తీరు, క్యారెక్టర్ కోసం పడిన కష్టం తెరపై కనిపిస్తుంది. అయితే సినిమాకి అనుకున్నంత ఫుట్ ఫాల్స్ కనిపించలేదు. సరైన ప్రమోషన్స్ లేకపోవడం ఒక కారణం అయితే, లిమిటెడ్ ఆడియన్స్‌కి మాత్రమే కనెక్ట్ అయ్యే కంటెంట్ కావడం మరో కారణం. అయితే సినిమా కోసం విక్రమ్ పడిన కష్టం వృధా కాదనే చెప్పాలి. ఒక యాక్షన్ సినిమా ని ఇలాంటి అప్రోచ్‌తో కూడా తీయొచ్చనే ఓ కొత్తదారిని సినిమా చూపించింది. మున్ముందు ఇలాంటి స్టయిల్ మేకింగ్‌లో సినిమాలు వస్తే గనుక సినిమా స్వరూపంలో ఓ కొత్త ఒరవడి వస్తుందనే చెప్పాలి.

**- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..**

# రంభ ఊర్వశి మేనక చేతులెత్తేస్తారు!

స్వర్గంలో "రంభ- ఊర్వశి- మేనక"లను కొట్టే అందగత్తెలున్నారా? ఇంద్రుని కుమార్తెల అందచందాల సమ్మోహనానికి గురి కాని మగాడున్నాడా? .. కానీ ఇప్పుడు ఆ అభిప్రాయం మార్చుకుంటారు. ఇదిగో ఇక్కడ ఆ ముగ్గురిని తలదన్నే అప్సరస ప్రత్యక్షమైంది. ఒకే ఒక్క లుక్కు చాలు.. అల్ట్రా బ్యూటీ ముందు పోటీపడలేక రంభ ఊర్వశి మేనక చేతులెత్తేస్తారు. పోటీ నుంచి నిరభ్యంతరంగా తప్పుకుంటారు. భారతీయ సినీపరిశ్రమలో దశాబ్ద కాలంగా హవా సాగిస్తున్న మొరాకో బ్యూటీ నోరా ఫతేహి దేవతా సుందరి రూపంతో కుర్రకారు గుండెల్లో నిదురిస్తోంది. మతి చెడే అందంతో కవ్వించడంలోనే కాదు.. అద్భుతమైన డ్యాన్సింగ్ ప్రతిభతో హృదయాలను గెలుచుకుంది.

నోరా సోషల్ మీడియాల్లో బోల్డ్ ఫోటోషూట్లతోను పాపులరైంది. ఈ బ్యూటీ తాజా ఫోటోషూట్ నెవ్వర్ బిఫోర్ అంటూ కితాబిచ్చేస్తోంది యూత్. ప్రఖ్యాత "బ్రైడ్స్ టుడే" కవర్ పేజీ కోసం నోరా ఫోజులు గుబులు రేకెత్తిస్తున్నాయి. ఈ భామ వైట్ అండ్ బ్లాక్ డిజైనర్ డ్రెస్‌లో ఎంతో అందంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆ నుదుటిన పాపిడిబొట్టు.. నల్లని కాటుక కళ్లు.. మెడలో వెండి హారం.. చూడగానే భారతీయ ట్రెడిషన్‌ని ఎలివేట్ చేస్తుంటే, జడలో పది మూరల మల్ల చెండు సువాసనలు కుర్రకారును మత్తులోకి దించుతోంది. కెరీర్ మ్యాటర్‌కి వస్తే...లారెన్స్ మాస్టార్ కాంచన చిత్రంలో నోరా ఫతేహి ఓ కీలక పాత్రలో నటిస్తోంది. ఈ సినిమా తాజా అప్ డేట్ తెలియాల్సి ఉంది. మరోవైపు రియాలిటీ షోల జడ్జిగాను నోరా పాపులరైంది.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో..**






# అయ్యో పాపం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు!

**కొన్ని విషయాలు దేవతావస్త్రం కథలాంటివి. అందరికీ అన్నీ తెలుసు. కానీతెలియనట్లు ఉంటారు. లేదా తెలిసి తెలిసీ అందులోనే మునుగుతూ ఉంటారు. అలాంటి ఒకానొక శ్రమదోపిడీ కథ ఇది. ఓ కంపెనీల్లారా! పోటీలు పడి మా శ్రమను దోచుకోండి! అంటూ మనకు మనమే పోటీలు పడి అభ్యర్థించే గాథలివి.**

సాఫ్ట్ వేర్ ఉద్యోగులు యాభై ఏళ్ళకే వృద్ధులైపోతున్నారంటూ తెలంగాణ శాసనసభలో సి పి ఐ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేస్తూ అనేక విషయాలను ఏకరువు పెట్టారు.

1. ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ కొలువంటే క్రేజ్ ఉండేది. ఇప్పుడు వారిని చూస్తే జాలేస్తోంది.
2. వారి శక్తిని, యవ్వనాన్ని ఐటీ కంపెనీలు కరగదీస్తున్నాయి. పీల్చి పిప్పి చేస్తున్నాయి.
3. ఎప్పుడు పని చేస్తారో? ఎప్పుడు పడుకుంటారో? ఇంట్లో కూడా ఆఫీస్ పని ఎందుకు చేస్తుంటారో? అర్థం కావడం లేదు.
4. యాభై ఏళ్ళకే ముసలివాళ్లవుతున్నారు. వింతవింత రోగాలబారిన పడుతున్నారు.
5. తెలంగాణాలో ఎన్ని ఐటీ కంపెనీలున్నాయి? ఎన్ని లక్షల మంది ఐటీ ఉద్యోగులున్నారు?
6. వారి పని గంటలేమిటి? ప్రభుత్వ కార్మిక చట్టాలు వారికి వర్తిస్తాయా? వారికున్న వసతులు, హక్కులను పర్యవేక్షించేదెవరు?
7. శ్రమ దోపిడీతో పాటు మేధో దోపిడీ కూడా జరుగుతోంది.
8. ఐటీ కంపెనీలకు ఇన్నిన్ని రాయితీలిచ్చే ప్రభుత్వాలకు అసలు ఆ కంపెనీల ఉద్యోగ/కార్మిక విధానాలపై నియంత్రణ ఉందా?


వారు 50 ఏళ్లకే వృద్ధులవుతున్నారు!
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను చూస్తే జాలేసే పరిస్థితి
- కంపెనీలు మేధో దోపిడీకి పాల్పడుతున్నాయి
- సీపీఐ సభ్యుడు కూనంనేని ఆవేదన

వీటన్నిటికి ప్రభుత్వం ఏమి సమాధానం చెప్పిందో మీడియాలో ఎక్కడా వార్తగా రాలేదు. చెప్పినా రాలేదో! అసలు చెప్పలేదో! స్పష్టత లేదు. కనీసం ఈ విషయాలను చట్టసభలో ప్రభుత్వం దృష్టికి తెచ్చినందుకు, ప్రజలకు తెలిసేలా చేసినందుకు కూనంనేనిని అభినందించాలి.


ఫలానా పేరుగొప్ప ఐటీ కంపెనీలో వెయ్యి మంది ఉద్యోగుల తొలగింపు, ఫలానా అంతర్జాతీయ ఐటీ కంపెనీ బెంగళూరు కేంద్రంలో మూడు వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన

ఫలానా కంపెనీ ఉద్యోగుల ఊస్టింగ్ ఆర్డర్స్‌ను మెయిల్/ఫేస్ బుక్/ఇన్స్టా/వాట్సాప్‌లో పోస్ట్ చేసిన ఫలానా సిఈఓ అని లెక్కలేనన్ని వార్తలు మీడియాలో చూస్తూనే ఉన్నప్పుడు ఈ విషయాలన్నీ ప్రభుత్వానికి తెలియకుండా ఎందుకుంటుంది? తెలుసు. తెలిసినా తెలియనట్లు, అది ప్రభుత్వానికి సంబంధం లేని ప్రయివేటు వ్యవహారమన్నట్లు ఊరికే గుడ్లప్పగించి చూస్తూ ఉంటుంది.

ఐటీ ఉద్యోగాలంటే ఇలాగే ఉంటాయి. ఏ రోజు ఆఫీస్ నుండి "యూ ఆర్ ఫైర్డ్" అన్న సందేశం అందుకోవాల్సి వస్తుందోనన్న భయంతోనే పనిచేస్తూ ఉండాలన్న సామాజిక అంగీకారం కూడా వచ్చినట్లుంది.

నెలకు పాతిక వేలు జీతమొచ్చే ఐటీ ఉద్యోగి అయిన పట్టణ యువకుడిని పెళ్ళి చేసుకోవడానికి ఇష్టపడే అమ్మాయిలు పదెకరాల వ్యవసాయంతో నెలకు లక్ష రూపాయలు సంపాదించే గ్రామీణ రైతును పెళ్ళి చేసుకువడానికి ఇష్టపడడం లేదు కాబట్టి దేశంలో యువకులందరూ పట్టణాల్లో, మహానగరాల్లో ఐటీ ఉద్యోగాలే చేయాల్సి వస్తోంది. ఒక కార్యకర్త ఈ బాధను చెప్పుకుంటే మహారాష్ట్రలో ఒక ఎమ్మెల్యే రైతులయిన కార్యకర్తలకు పెళ్ళి సంబంధాలు చూసే బాధ్యతను నెత్తిన వేసుకున్న కథలను ఈమధ్యే విన్నాం.

అసలే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏ.ఐ. రోజులు. బెంగళూరులో ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలో అభ్యర్థిని ఏ.ఐ. కంటే వేగంగా, సృజనాత్మకంగా నువ్వెలా పనిచేయగలవో! నిరూపించుకో! అని అడిగితే అతడు స్పృహదప్పి పడి ఇప్పటిదాకా లేవలేదు. ఇక లేవలేడు కూడా! బయట ఏఐతో పోటీ పడాల్సిన వాస్తవ పరిస్థితి ఉంటే వామపక్ష కూనంనేని ఇంకా పని గంటలు, కార్మికుల హక్కులు, వేతనాలు, వీక్లీ ఆఫ్, పిఎఫ్, ఈఎస్ఐ లాంటి పాతరాతియుగపు పని పరిభాష మాట్లాడుతున్నారు- పాపం!


Courtesy: Economic Times

Freshers must Crack AI-written Code to Land a Job at IT Firms

Seek engineers who are agile thinkers, not just scriptwriters who can copy paste codes

Sameer Ranjan Bakshi

Bengaluru: With IT firms and employees increasingly using AI tools to write codes, the deliverables in hiring tests for entry level and junior engineers are changing. From being asked to write simple codes, candidates are being asked to optimize and restructure existing AI written codes, to improve quality, say analysts working on AI and cyber security.

With AI tools easily available, IT firms are also ensuring that they don't hire candidates who can just copy-paste codes.

Experts say traditional tests that require candidates to write code from scratch don't reflect the realities of modern development, especially in large organizations with extensive code libraries and AI tools.

"The focus in hiring has shifted from just programming skills to broader problem-solving capabilities..... Hiring tests for entry-level engineers are evolving to gauge candidates' ability to learn new methods, optimize existing code, and "refactor" it to improve quality," said Chirag Mehta, vice president and principal analyst, Constellation Research. "It's about finding engineers who are agile thinkers, not just scriptwriters."

Refactoring is restructuring the source code of an application or piece of software so as to improve operation without altering functionality. Mehta added that with Generative AI automating a big chunk of programming tasks, companies aren't just looking for programmers anymore. They need engineers who can innovate and adapt. They are looking for engineers who fall in love with problems and not solutions. On questions about the need to secure AI-generated code, Mehta elaborated that AI-generated code introduces a unique security challenge. "There's a bias to trust code created by AI, but these tools are as prone, if not more, to introducing vulnerabilities as human coders. If an AI tool generates insecure code, that risk multiplies as more developers rely on it across projects. Companies must "shift left" to address security upfront—reviewing AI-generated code for vulnerabilities and rigorously validating the tools themselves. Security needs to be baked into the code generation process, ensuring that AI aids development without compromising safety, leading to security by design."

Cracking the Code
- Infosys last fiscal generated 3m codes using large language model
- Cognizant revealed that it was generating 1,50,000 lines of codes per month using AI tools
- Google recently said 25% of its new code is generated by AI
- SAP said 30-40% of its core products' code is touched by AI tools




**కొస మెరుపు:-**

**యాభై ఏళ్ళకు వార్ధక్యం అని కూనంనేని కొంచెం ఉదారంగా సంఖ్యను పెంచినట్లున్నారు కానీ పని ఒత్తిడి, నిద్రలేని పనులతో నిజానికి 35, 40 లలో కూడా వృద్ధులైన ఐటీ ఉద్యోగులు కనిపిస్తారు! ఐటీ వెలుగుల్లో ఇలాంటి క్రీనీడలెన్నో!**

**-పమిడికాల్వ మధుసూదన్**

## మందస కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

(సత్యంన్యూస్, మందస)

పలాస నియోజకవర్గం మందస కేంద్రంగా గిరిజన అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంను ప్రభుత్వం మంజూరు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు బుధవారం మందసలో శ్రీకాకుళం జిల్లా గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తాహసిల్దారు ఎస్.హైమావతికి వినతి పత్రం అందించారు. మందస మండలంతోపాటు పలాస నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న గిరిజనుల సమస్య పరిష్కరించాలని, ఈప్రాంతంలో గల భూములను భూకబ్జాలకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు బడా పారిశ్రామికవేత్తలు పాల్పడుతున్నారని చట్టవిరుద్ధంగా వీరు సంపాదించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గిరిజనులు కోరారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న గిరిజనులకు భూములకు హక్కులు కల్పించి పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు ఎక్సైజ్ పోలీసులు గిరిజనులపై బనాయిస్తున్న అక్రమ సారా కేసులను బనాయిస్తున్నారన్నారు. షెడ్యూల్ లేని గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్డ్ ప్రాంతాలుగా గుర్తించాలని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని 1/70 చట్టాన్ని అమలు చేయాలని గిరిజన గ్రామాల్లో సాగునీటి వనరులను మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చాపర సుందర్‌లాల్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి సవర హరికృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి, గిరిజన సంఘం నాయకులు సవర ఎంగిలాకు, సవర సోంబా రమ్మ,, సవర నీలకంఠం, సవర కిరణ్ కుమార్, దండాసి రవి, సవర రమేష్, సవర జునాస్ ,సవర కురామణి, సవర భువనేశ్వర్ దులాయ్, తదితరులు పాల్గొన్నారు.



# హేతుబద్ధత లేని వర్గీకరణ ఆపాలి


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హేతుబద్ధత లేని వర్గీకరణను తక్షణమే నిలుపుదల చేయాలని జాతీయ రెల్లి ఎస్సీ గ్రూపు కులాల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా రెల్లి గ్రూపు కులాలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ నగరంలోని పెద్దరెల్లివీధి నుంచి ఏడురోడ్ల జంక్షన్ మీదుగా కలెక్టరేట్ వరకు శాంతియుతంగా భారీ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కలెక్టరేట్ చేరుకొని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి పి సుధాకర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచన మేరకు ఆర్థిక, సామాజిక, ఉద్యోగ, ఉపాధి వెనుకబాటుతానికి ప్రాధాన్యత ఇవ్వాలని అంకెల్లో, ఎబీసీడీ అక్షర క్రమంలో ప్రాధాన్యత ఇవ్వడం మోసగించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రాతినిధ్యం లేని కులాలకు ప్రభుత్వమే బాధ్యత తీసుకొని రాజ్యాంగ ఫలాలను అందజేయాలని కోరారు. కులగణన చేసి తరువాత జిల్లాల, జోన్‌ల వారీగా వర్గీకరణ చేయాలి తప్ప రాష్ట్రాన్ని యూనిట్ చేయడం వలన రెల్లి, గ్రూపు కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పారు. రాష్ట్రంలో విద్యా, ఉద్యోగ నియామకాల్లో ఆర్టికల్ 371 (డి) అనుసరించి జిల్లా, జోన్, రాష్ట్రంలో అవకాశాలు కల్పించాలని కోరారు. అలా కాని పక్షంలో రెల్లి గ్రూపు కులాల పురుష అభ్యర్థులు, విద్యార్థులు గతంలో 1999-2004 మధ్య కాలంలో జరిగిన వర్గీకరణ సమయంలో ఏ మాదిరిగా కళాశాలల్లో, యూనివర్శిటీల్లో, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడిసిన్ ఆయా విభాగాల్లో దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశం కోల్పోయారో అదే మాదిరిగా మరలా ప్రస్తుత వర్గీకరణ వల్ల నష్టం జరుగుతుందని వివరించారు. 1 శాతం రిజర్వేషన్ ను రోస్టర్ నెంబరు 2 కేటాయించడం వలన రెల్లిగ్రూపులో మహిళలకు మాత్రమే అంతంత మాత్రంగా రిజర్వేషన్ వర్తిస్తుందని, గ్రూపు-ఎ లో మహిళలు లేనప్పుడు గ్రూపు-బి మహిళలు క్యారీ ఫార్వర్డ్ చేసి రిజర్వేషన్లు పరోక్షంగా బి-గ్రూపు వారికి అందజేస్తారన్నారు. గ్రూప్-ఎ పురుష విద్యార్థులకు విద్యా, ఉద్యోగ నియామకాల్లో ఎటు వంటి అవకాశం ఉండదన్నారు. దీని వలన వారి జీవితం శాశ్వతంగా అంధకారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాము వర్గీకరణను వ్యతిరేకించడం లేదని హేతుబద్ధత లేని వర్గీకరణను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనలు, సలహాల మేరకు వర్గీకరణ చేయాలని కోరుతున్నామన్నారు. ఇందులో భాగంగా రెల్లి గ్రూపు కులాల విద్యా, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేకమైన నిధులు కేటాయించి వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం పెద్ద మనసుతో సహకరించాలని వారంతా ముక్తకంఠంతో కోరుతున్నామన్నారు. అలా కానీ పక్షంలో ఎస్సీల వర్గీకరణ చేయకుండా 15 శాతానికి అదనంగా 2011 జనాభాను బట్టి 17 శాతానికి రిజర్వేషన్ పెంచి కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రెల్లి గ్రూపు కులాల కోసం అసెంబ్లీ సమావేశాల్లో చర్చించిన ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్వోకు వినతిప్రతం అందించినవారిలో జిల్లా అధ్యక్షులు అర్జి కోటి, నగర అధ్యక్షులు ఎ ఈశ్వరరావు, రెల్లి ఉప కులాల నాయ కులు కాశీ రథో, గోడలి మిన్ను, దండాసి దుర్యోధన, బైరి శివప్రసాద్, దేవర రాము, లోకొండ లక్ష్మణరావు, మజ్జి బాబ్జి, విశాఖపట్నం రవి, వీర గొట్టం ఆనంద్, రణస్థలం ఫణి కుమార్, జలగడుగుల శ్రీరామ, కె వెంకటరావు, జె గోవిందరావు, ఏ గోవిందరావు, విజయ్, ఎం రామారావు, జే శ్రీను, ఇంటి రమణమూర్తి, ఏ రామ్మోహన్ రావు, ఏ తిరుపతిరావు, కె.కూర్మారావు, కే జ్యోతి ప్రసాద్, ఏ దిలీప్, బి.యోగి, కవ్వాడి రవి, ఎ.శివ, ఏ.ఆదిలక్ష్మి, బి.ధనలక్ష్మిలు పాల్గొన్నారు.

## ప్రమోషన్ ఉత్తర్వులు పునరాలోచించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లకు ఈ మధ్యకాలంలో ఏఎస్ఓగా ప్రమోషన్ కోసం ఏర్పాటు చేసిన కమిటీ జీవోపై పునరాలోచించి మరల కమిటీ ఏర్పాటుచేసి న్యాయం చేయాలని జిల్లాకు చెందిన డిజిటల్ అసిస్టెంట్లు కోరారు. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వీరిలో దాదాపు 80% బిటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పట్టాలు పొంది, టెక్నికల్‌గా మేధస్సు ఉన్నవారేనన్నారు. దీనిని గమనించి వారిని టెక్నికల్ వైపు పదోన్నతి కల్పించాలని కోరారు. సీఎం విజన్ స్వర్ణాంధ్ర-2047 కల సాకారానికి వీరికి అన్ని విధాలుగా అర్హత ఉందన్నారు. తమకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై న్యాయం చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. వీటికి స్పందించిన ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గార, శ్రీకాకుళం రూరల్ మండల డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# తప్పతాగి చర్చి గోడలపై రాశారు





- ❖పోలీసుల అదుపులో నిందితులు
- ❖హిందూ ఆలయాలపై రాసినవారి కోసం గాలింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ఒకేసారి రెండు మతాలకు సంబంధించిన దేవాలయాలపై అన్యమత ప్రచారానికి సంబంధించిన రాతలు వెలుగుచూడటంతో జిల్లాలో సంచలనమైంది. ఈమధ్య కాలంలో గ్రామాల్లో అన్యమత ప్రచారాన్ని పలుచోట్ల అడ్డుకుంటున్న సందర్భంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతోంది. పోలీసుల అనుమతితో ప్రచారం చేస్తున్నామని చెబుతున్నా హిందూ దేవాలయాలకు దూరంగా క్రైస్తవ సభలు పెట్టుకోవాలని సూచించే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం నగరంలో ఉన్న టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న రోమన్ కేథలిక్ చర్చి, చిన్నబజారులో ఉన్న తెలుగు బాప్టిస్టు చర్చి గోడలపై జై శ్రీరామ్ అన్న రాతలను మంగళవారం రాత్రి గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో జలుమూరు మండలం యలమంచిలి గ్రామంలో ఎండలమల్లికార్జునస్వామి ఆలయ గోడల మీద, కామేశ్వరిపేట ఆంజనేయ స్వామి ఆలయ గోడలపైన క్రీస్తు నినాదాలు కనిపించాయి. ఈ రెండూ ఒకేసారి వెలుగులోకి రావడంతో మతాల మధ్య చిచ్చుపెట్టి శాంతిభద్రతల సమస్యను సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని అంతా భావించారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అందుకే ఆలయాలు, ప్రార్థన మందిరాల పైన అన్యమత ప్రచారం నినాదాలు రాసినవారిని పట్టిస్తే రూ.25వేలు నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. ఇందులో జలుమూరు మండలంలో హిందూ దేవాలయ గోడల పైన క్రైస్తవ నినాదాలు రాసినవారు ఇంకా దొరకలేదు కానీ, నగరంలో ఆర్‌సీఎం చర్చి, తెలుగు బాప్టిస్ట్ చర్చి గోడలపై జై శ్రీరామ్ అని నినాదాలు రాసినవారు పోలీసుల అదుపులో ఉన్నారు. గూనపాలెంకు చెందిన ఒకరు, మేదరవీధికి చెందిన మరో ఇద్దరు మద్యం సేవించి చర్చి గోడల మీద ఈ విధంగా రాసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు.

## కుప్పిలి మోడల్ స్కూల్‌లో అంతర్గత విచారణ



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

కుప్పిలి మోడల్ స్కూల్‌లో రాష్ట్ర అధికారులు విచారణ చేపట్టారు. రాష్ట్ర మోనటరింగ్ అధికారి కె.ధర్మకుమార్ పాఠశాలను సందర్శించి ప్రిన్సిపల్, ఉపాధ్యాయులతో మాట్లాడారు. గత మూడు సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థుల సీసీఈ రిజిస్టర్లు, ప్రోగ్రస్ కార్డులను పరిశీలించినట్లు ప్రిన్సిపల్ కె.అప్పాజీ రావు ఒక ప్రకటనలో తెలిపారు.




## ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం

▶▶తహసీల్దారు గణపతిరావు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



అభ్యంతరం లేని ప్రభుత్వ పొరంబోకు భూముల్లో ఇళ్లు కట్టుకొని ఉంటున్న పేదవర్గాల నివాసాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీవో 30 ద్వారా అవకాశం ఇచ్చిందని తహసీల్దార్ గణపతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి అర్జీదారుడి స్వాధీనంలో ఉన్న నివాసాలకు మాత్రమే ఇది వర్తిస్తుందని వివరించారు. క్రమబద్ధీకరణ దరఖాస్తులను వార్డు, గ్రామ సచివాలయాల్లో సమర్పించి, ప్రభుత్వ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఉన్న ఆవాసాలకు మాత్రమే ఈ స్కీం వర్తిస్తుందని తెలిపారు. నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షల్లోపు ఆదాయం కలిగినవారు మాత్రమే క్రమబద్ధీకరణ స్కీంకు అర్హులని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునేవారి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి, ఆదాయపన్ను చెల్లింపులు చేసిన వారు ఉండకూడదని సూచించారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సొమ్ము కొట్టు.. స్లిప్పు పట్టు?

- ✔ డిగ్రీ, పీజీ దూరవిద్య పరీక్షల్లో చూచిరాతలు
- ✔ పాతపట్నం కేంద్రంపై ఆరోపణలు



(ఫైల్‌ఫోటో)

(సత్యంన్యూస్, పాతపట్నం)

విద్యావ్యవస్థ నానాటికీ దిగజారుతుందని చెప్పడానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెంకటేశ్వర యూనివర్సిటీకి చెందిన డిగ్రీ, పీజీ దూరవిద్య పరీక్షలు జరుగుతున్న తీరే దీనికి నిదర్శనం. సొమ్ము కొడితే చాలు.. స్లిప్పులు పెట్టుకుని పరీక్షలు రాసేందుకు అధ్యాపకులు, కాలేజీ సిబ్బందే ప్రోత్సహిస్తున్నారని విద్యార్థులే ఆరోపణలు గుప్పిస్తున్నారు. బుధవారం జరిగిన బీఏ మూడో సంవత్సరం పరీక్షకు హాజరైన విద్యార్థులకు చూసి రాసుకునే అవకాశం ఇచ్చేందుకు డిగ్రీ కాలేజీ సిబ్బంది రూ.5వేలు డిమాండ్ చేసినట్టు కొందరు విద్యార్థులు 'సత్యం'కు ఫోన్‌చేసి మరీ సమాచారం ఇచ్చారు. టెక్కలి, పాతపట్నం పరిధిలో వెంకటేశ్వర యూనివర్సిటీ దూరవిద్య పరీక్షలకు హాజరైన విద్యార్థులందరి నుంచి రూ.5వేలు చొప్పున వసూలుచేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెక్కలిలో విశ్వజ్యోతి, పాతపట్నంలోని కిరణ్మయి కాలేజీల ద్వారా దూరవిద్య పరీక్షలకు హాజరైన విద్యార్థులందరి నుంచి డిగ్రీ కాలేజీ సిబ్బంది డబ్బులు వసూలు చేసినట్టు తెలిసింది. వార్షిక పరీక్షలన్నింటికీ సహాయం చేస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్టు విద్యార్థులు, తల్లిదండ్రులు 'సత్యం' వద్ద వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చదువును కొనుక్కునే సంస్కృతిని విడనాడి చదువుకునే విధానానికి అవకాశం కల్పించి విద్యార్థుల్లో నైపుణ్యం పెరిగేందుకు కృషి చేయాలని ఉన్నత విద్యాశాఖ అధికారులకు విన్నవించారు.

## ఆ స్థలం వారిదేనట!? దాని చుట్టూ నాలుగు స్తంభాలాట

(మొదటిపేజీ తరువాయి)

మొత్తానికి మరికొంత కలిపి ఇవ్వడానికి నెయ్యల రాజు అంగీకరించినట్టు తెలిసింది. అయితే నెల రోజులు గడుస్తున్నా ఒప్పందం మేరకు డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో నారాయణరెడ్డి న్యాయపోరాటానికి సిద్ధమైనట్టు తెలిసింది. నెయ్యల రాజుతో పాటు రొక్కం సాయికి నోటీసులు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. మరోవైపు 219/3 సర్వే నెంబరులోని 565.5 చదరపు అడుగుల స్థలానికి అసలు వారసులైన బొత్స గోపాలరావు, ఆయన కుటుంబ సభ్యులు తమ వాదనకు మద్దతుగా 1968 నాటి రెవెన్యూ రికార్డులు, ఎస్ఎల్ఆర్, లింక్ డాక్యుమెంట్లను తీసుకొని కలెక్టర్, ఆర్డీవోలను కలిసి జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయడానికి సిద్ధపడుతున్నట్లు తెలిసింది.

**అదీ.. ఇదీ.. ఒకటి కాదా?**

మరోవైపు ఈ స్థలాన్ని తాను కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లు చూపిస్తున్న బోర బుజ్జి, రొక్కం సాయిలు పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. అయితే చెల్లింపుల విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. కొనుగోలు సమయంలో రొక్కం సాయి చెల్లించిన మొత్తానికి కొంత లాభం జోడించి చెల్లించడం ద్వారా ఆ స్థలాన్ని బోర బుజ్జి సొంతం చేసుకునే దిశగా చర్చలు జరిగాయి. అయితే రొక్కం సాయిని వెనుక నుంచి నడిపిస్తున్న రమణ అనే వ్యక్తి దీనికి అంగీకరించలేదని తెలిసింది. దీంతో సాయి మరో వ్యాపారికి ఆ స్థలాన్ని విక్రయించడానికి సిద్ధమైనట్లు తెలిసింది. దీనికి ముందు బోర బుజ్జికి ఆ వివాదాస్పద స్థలంతో సంబంధం ఏమిటని రమణ ఆరా తీసినట్టు తెలిసింది. బోర బుజ్జి చూపిస్తున్న డాక్యుమెంట్‌లో పేర్కొన్న సర్వే నెంబర్ 225/1లో ఉన్న స్థలాన్ని చూపించమంటూ దాన్ని విక్రయించిన యు.మన్మథరావును పట్టణానికి తీసుకువచ్చారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా జీటీ రోడ్డుకు తూర్పు దిశలో క్రిస్టియన్ శ్మశానవాటిక సమీపంలో స్థలం ఉన్నట్లు ఆయన చెప్పినా కచ్చితంగా ఎక్కడ ఉందన్న విషయాన్ని మాత్రం మన్మథరావు చూపించలేక పోయారని తెలిసింది. కాగా బోర బుజ్జి కొనుగోలు చేసిన స్థలానికి, రొక్కం సాయి కొనుగోలు చేసిన స్థలానికి హద్దులు ఒక్కటే కావడంతో ఆ రెండూ ఒక్కటేనన్న వాదనను బోర బుజ్జి వినిపిస్తున్నారు. అయితే రొక్కం సాయి మాత్రం వేరొకరికి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

**పొజీషన్ కోసం ఒకరు.. నిర్మాణ అనుమతి కోసం ఇంకొకరు**

సర్వే నెంబర్ 219/3లోని 565.5 చదరపు అడుగుల స్థలాన్ని రమణ సహకారంతో సొంతం చేసుకున్న రొక్కం సాయి ఆ స్థలంలో నడుస్తున్న బట్టల దుకాణం నుంచి రూ.30వేలు అద్దె వసూలు చేస్తున్నట్టు తెలిసింది. దుకాణంలో నెయ్యల రామారావు పేరుతో ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను రొక్కం సాయి పేరుతో మార్పించారు. దీన్ని ఆసరా చేసుకొని దుకాణం ఉన్న స్థలానికి పొజీషన్ ఇవ్వాలని పలాస తహసీల్దారుకు రొక్కం సాయి దరఖాస్తు చేసినట్లు తెలిసింది. అనంతరం స్థానిక సీనియర్ టీడీపీ నాయకుడితో తహసీల్దారుకు ఫోన్ చేయించి పొజీషన్ సర్టిఫికేట్ ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారని సమాచారం. అయితే 'సత్యం'లో ఈ వివాదంపై కథనాలు రావడంతో జంకిన తహసీల్దార్ పొజీషన్ ఇవ్వడానికి కొంత సమయం కావాలని టీడీపీ నాయకుడిని కోరినట్లు తెలిసింది. మరోవైపు ఇదే స్థలంలో భవన నిర్మాణానికి బోర బుజ్జి ప్రయత్నిస్తున్నారు. పంచాయతీ అప్రూవల్ ఉన్నందున భవన నిర్మాణానికి ప్లాన్ ఇవ్వాలని ఆయన పెట్టిన దరఖాస్తుపై మున్సిపల్ చైర్మన్ సంతకం చేసినా కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉంచినట్టు తెలిసింది. ఎవరికో చెందిన స్థలాన్ని నలుగురు వ్యక్తులు తమదంటే తమదని అధికారుల చుట్టూ తిరుగుతూ మంత్రాంగాలు నెరుపుతుండటంపై పట్టణంలో తీవ్ర చర్చ జరుగుతోంది. స్థలానికి అసలు వారసులు ఉన్నా, వారిని కాదని దాన్ని సొంతం చేసుకునేందుకు జరుగుతున్న కుట్రలపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**శ్రీకాకుళం జిల్లా ప్రజలకు శుభవార్త**

ప్రముఖ ప్రసూతి మరియు స్త్రీవైద్య నిపుణులు

తేది: 5-4-2025 శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా చూడబడును.

డా॥ బొడ్డేపల్లి మీనాక్షి M.B.B.S., DGO

ప్రసూతి మరియు స్త్రీ వైద్యనిపుణులు

హిమోగ్లోబిన్, షుగర్ టెస్టులు ఉచితంగా చేయబడును.
అవసరమైనచో థైరాయిడ్ టెస్ట్ 50% రాయితీతో చేయబడును.
ఉచితంగా ఓపీ చూడబడును. ఈ అవకాశం ఈ ఒక్కరోజు మాత్రమే.

తేది: 5-4-2025 శనివారం
ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు

-: ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవలెను :-

శ్రీ వైష్ణవి గణేష్ డాక్టర్స్ ప్లాజా

డే & నైట్ జంక్షన్, పెట్రోల్ బంకు ఎదురుగా,
సత్య లాడ్జి ప్రక్కన, శ్రీకాకుళం, సెల్: 99854 69073, 98661 68604, 70755 18604




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.